ఓటు రెడీ

- రెండు నియోజకవర్గాల్లో 4,17,792 మంది ఓటర్లు
- మండపేటలో 2,17,645 మంది
- రామచంద్రపురంలో 2,00,147 మంది
- పురుషుల కంటే మహిళలు అధికం


ఓటర్ల జాబితా


మండపేటలో దరఖాస్తుల పరిశీలనపై రాజకీయ ప్రతినిధులతో చర్చిస్తున్న ఓటు నమోదు అధికారి

కపిలేశ్వరపురం: రాజ్యాంగంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను నిర్వహించింది. 2023 నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించడంతో ఓటర్ల సంఖ్య పెరిగింది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఇటీవల విడుదల చేసిన జాబితా ప్రకారం 4,17,792 మంది ఓటర్లు ఉన్నారు.

రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక పట్టణం, మూడు మండలాలు ఉండగా, పురుషులు 99,361, స్త్రీలు 1,00,785, థర్డ్ జెండర్ ఒకరు, మొత్తం 2,00,147 మంది ఓటర్లున్నారు. మండపేట నియోజకవర్గంలో ఒక పట్టణం, మూడు మండలాలుండగా, పురుషులు 1,05,949 మంది, స్త్రీలు 1,11,692, థర్డ్ జెండర్ నలుగురు మొత్తం 2,17,645 మంది ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లో పురుషులు 2,05,310 మంది, స్త్రీలు 2,12,477 మంది ఉన్నారు. పురుషులు కంటే 7,167 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

2024 జనవరి 22న ప్రకటించిన జాబితా ప్రకారం మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
రామచంద్రపురం టౌన్	16,876	18,159	01	35,036
రామచంద్రపురం(రూ)	28,436	28,829	0	57,265
కాజులూరు	28,130	28,058	0	56,188
కె.గంగవరం	25,919	25,739	0	51,658
మండపేట టౌన్	22,825	25,325	--	48,150
మండపేట రూరల్	30,902	32,632	03	63,537
రాయవరం	25,619	26,957	01	52,577
కపిలేశ్వరపురం	26,603	26,778	--	53,381
మొత్తం	2,05,310	2,12,477	05	4,17,792

ప్రత్యేక శిబిరాలతో పెరిగిన ఓటర్లు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద గతేడాది నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఫారం ఆరు తొలి విడతలో 950, రెండో విడతలో 827, మొత్తం 1,777, ఫారం ఏడు తొలి విడతలో 366, రెండో విడతలో 309, మొత్తం 675, ఫారం ఎనిమిది తొలి విడతలో 466, రెండో విడతలో 488, మొత్తం 954 దరఖాస్తులందాయి. మూడు రకాల ఫారాల దరఖాస్తులు కలిపి మొత్తం 3,406 అందడంతో ఓటర్ల సంఖ్య పెరిగింది. రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఫారం ఆరు తొలి విడతలో 1,016, రెండో విడతలో 1,061, మొత్తం 2,077, ఫారం ఏడు తొలి విడతలో 263, రెండో విడతలో 675, మొత్తం 938, ఫారం ఎనిమిది తొలి విడతలో 430, రెండో విడతలో 241, మొత్తం 671 మూడు రకాల ఫారాలు కలిపి మొత్తం 3,686 దరఖాస్తులను పరిశీలించారు.

ప్రణాళికాబద్ధంగా కృషి



అర్హత ఉన్నవారందరికీ ఓటు హక్కును కల్పించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలపై క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. వారానికి ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో నియోజకవర్గ ఓటు నమోదు అధికారి మదన్‌మోహన్ విధిగా సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓల కృషితో నమోదు దరఖాస్తుల పరిశీలన సకాలంలో పూర్తయింది.

– యరమాటి వెంకన్నబాబు, ఓటు నమోదు ప్రతినిధి, మండపేట

కమిషనర్ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



రామచంద్రపురం: మున్సిపల్ కమిషనర్‌గా బి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి గుడివాడ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. అద్దంకి నుంచి శ్రీనివాసులు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, డీఈ దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, కౌన్సిల్ సభ్యులు అభినందనలు తెలిపారు.

రేపు శ్రీఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘ సమావేశం

రాయవరం: శ్రీఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం ఆత్మీయ సమావేశం ఈ నెల 4న రాయవరం మండలం జీవీఎంఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంఘ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి విల్లూరి వీరభద్రరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. 1941లో సంఘాన్ని ఏర్పాటు చేశారని, మూడేళ్లకోసారి రాష్ట్ర సంఘ సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ఆదివారం పసలపూడిలో రాష్ట్ర స్థాయి సమావేశం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా హాజరవుతారన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్‌కు వీడ్కోలు సత్కారం


తహసీల్దార్ రాజేశ్వరరావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం (మండపేట): బదిలీపై ఎన్టీఆర్ జిల్లాకు వెళ్తున్న మండపేట తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావును శుక్రవారం మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు సత్కరించారు. ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఎంపీటీసీ తాతపూడి ఉషా, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌శెట్టి శ్రీహరి బాబు, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, పార్టీ నాయకులు కుడుపూడి రాంబాబు, రామ్‌శెట్టి శ్రీహరిరావు పాల్గొన్నారు.

రహదారుల నాణ్యత తనిఖీ


టేకిలో రహదారి నాణ్యతను తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రహదారుల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారి, పంచాయతీరాజ్ డీఈ రామనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో మండలంలోని టేకి, నేలటూరు గ్రామాల్లో ఆరు సీసీ రహదారులను నిర్మించారు. రహదారుల నాణ్యతను కోర్ కటింగ్ పద్ధతిలో తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల జేఈ డీవీ రాఘవులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: సత్యవాడ గ్రామంలోని రావిచెరువులో శుక్రవారం ఎంపీపీ పంపన నాగమణి రామాలయం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు నాణ్యతగా నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సర్పంచ్ సలాది సూర్యకళావతి, ఉప సర్పంచ్ వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు సలాది అర్జునరావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ


కంప్యూటర్, ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న వెంకటరమణ

కె.గంగవరం: పామర్రు ప్రభుత్వ జూనియర్ కాలేజికి సత్యస్కాన్ అధినేత కాదా వెంకటరమణ కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. శుక్రవారం కాలేజి సిబ్బందికి సుమారు రూ.లక్ష విలువైన వీటిని అందించారు. దాతలు అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని వెంకటరమణ కోరారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఆర్‌సీహెచ్ అసైన్డ్ వర్క్‌ను నిలిపివేయాలని, గతంలో చేసిన పనికి అలవెన్సులను అందజేయాలని కోరారు. సచివాలయ గ్రేడ్-3 సెక్రటరీలకు ఎంపీహెచ్ఏ ఫిమేల్ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోయిన సొమ్ము ప్రత్యక్షం

కొత్తపేట: దొంగిలించబడిన ఆలయంలో హుండీ సొమ్ము మళ్లీ ప్రత్యక్షమైన వైనమిది. మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం ఉంది. ఆలయ నిర్మాణ కర్త గొలకోటి మాధవరావు గత నెల 28న నాగపూర్ వెళ్లగా, 30న రాత్రి దొంగలు స్వామివారి హుండీని కొల్లగొట్టారు. 31న ఉదయం తిరిగివచ్చిన మాధవ్..దొంగల సంగతి స్వామి చూసుకుంటారులే అని, సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు జరిపించారు. శుక్రవారం ఉదయం మాధవ్‌తో పాటు స్థానిక భక్తులు ఆలయానికి వెళ్లగా, స్వామివారి విగ్రహం ముందు పళ్లెంలో రూ.7,630 నగదు, కొత్త తాళం కప్ప కనిపించాయి.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి


గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రాయవరం: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వాస్తవరూపంలో సుసాధ్యం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పసలపూడిలో నూతనంగా నిర్మించిన చింతా కాటమరెడ్డి సచివాలయం-1, చింతా సుబ్బారాయుడు హెల్త్ క్లినిక్‌లను త్రిమూర్తులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి మాట్లాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి, పరిపాలనను గ్రామ స్థాయికి తెచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇది దేశానికే ఆదర్శమన్నారు. ప్రభుత్వ నిధులకు దాతల ఆర్థిక సహకారం తోడైతే, ప్రభుత్వ భవనాలు కార్పొరేట్ స్థాయిలో మారతాయనడానికి పసలపూడిలో నిర్మించిన భవనాలే నిదర్శనమని పేర్కొన్నారు. సచివాలయ భవన నిర్మాణాలకు ఆర్థిక సాయం చేసిన చింతా సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి(బాబులు)ను త్రిమూర్తులు, సూర్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. సమావేశంలో అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, సర్పంచ్ కడలి పద్మావతి, రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మల్లిడి హరినాధరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు మాట్లాడారు.

గాంధీ విగ్రహం ఆవిష్కరణ

తొలుతగా సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి, రూ.80 లక్షలతో నిర్మించిన చింతా కాటమరెడ్డి సచివాలయ భవనం, రూ.35 లక్షలతో నిర్మించిన చింతా సుబ్బారాయుడు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను త్రిమూర్తులు, సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా 1,479 మహిళా శక్తి సంఘాలకు చెందిన రూ.13,70,40,036ల విలువైన చెక్కును అందజేశారు. గ్రామంలోని ఏడు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, మండల విప్ కర్రి విజేత, సినీ నిర్మాత తాడి గనిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చింతా సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

క్రీడా భవనానికి రూ.40 లక్షలు

కేటాయించిన ఎంపీ బోస్


కృత్తివెంటి విద్యా సంస్థను పరిశీలిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడా భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలు కేటాయిస్తున్నట్టు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యా సంస్థల్లో గుడా నిధులు రూ.20 లక్షలతో జరుగుతున్న డిజిటల్ లైబ్రరీ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. నాడు-నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ వెన్నేటి సుందర రామకుమార్, కె.బంగారుబాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్ ఉన్నారు.

రాజకీయాలకు ఊపిరి పోసిన జగనన్న

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్


గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు కర్రి జార్జిని పరామర్శిస్తున్న ఎంపీ బోస్ తదితరులు

కాజులూరు: టీడీపీ నేతల బూటకపు హామీలతో ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిన రాజకీయాలకు ముఖ్యమంత్రి జగనన్న ఊపిరి పోశారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శుక్రవారం తిప్పరాజుపాలెం, తర్లంపూడి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి, పార్టీ శ్రేణులను కలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 వరకూ హామీలిచ్చి, ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చెయ్యలేదని విమర్శించారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని వివరించారు. నవరత్నాల హామీలతో పాటు, అదనంగా మరో 50 కొత్త పథకాలు అమలు చేశారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను జగనన్న ఎక్కడా ఆపలేదన్నారు. చెయ్యగలిగిన హామీలే మేనిఫెస్టోలో జగనన్న ప్రకటించారని చంద్రబాబు మాదిరి అబద్ధపు హామీలతో మోసం చెయ్యగలిగితే 2014లోనే తాము అధికారంలోకి వచ్చేవారమన్నారు. పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురు స్థానిక సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఇటీవల భవనంపై నుంచి జారిపడిన భవన నిర్మాణ కార్మికుడు కర్రి జార్జిని ఎంపీ బోస్, ఇతర నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, సర్పంచ్‌లు నరాళ బాలరాజు, యాళ్ల మాణిక్యాంబ, ఎంపీటీసీ ఆనాల సీత, యాళ్ల శ్రీనివాస్, సువ్వారి గోవిందు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి


కపిలేశ్వరపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


నరసాపురపుపేట వైద్య శిబిరంలో కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కె.గంగవరంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్లను నిర్మించి, పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు, మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, నాయకులు పంపన సుబ్బారావు, జుత్తుక శ్యాంప్రసాద్, కాదా వెంకటేష్, కోటి వెంకట్రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగరలో ఆరోగ్య సురక్ష శిబిరం

కపిలేశ్వరపురం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరాన్ని శుక్రవారం స్థానిక సచివాలయం1లోని అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 392 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రత్యేక వైద్య నిపుణులు జి.శ్రావణి, ఎస్.అభిలాష్, జీవీ గీతాంజలి, ఎస్ సత్యనారాయణ రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులను అందజేశారు. నలుగురికి ఈసీజీ పరీక్ష చేయగా, మరో నలుగురికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, ఎంపీటీసీలు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, నాయకులు పిప్పర సంపతరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురపుపేటలో..

రామచంద్రపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నరసాపురపుపేటలో శుక్రవారం జరిగింది. సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మితో కలిసి ఎంపీపీ అంబటి భవాని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామస్తులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. అనంతరం వైద్యులు 405 మందిని పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. గతంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వి.తాతారావు, ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.సెలత్‌రాజు, పంచాయతీ కార్యదర్శి పిల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం రాజేశ్వరికి ఘన సత్కారం

పాఠశాలకు రూ.2 లక్షల విరాళం


రాజేశ్వరి, రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం గుణ్ణం రాజేశ్వరి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళావేదికపై హెచ్‌ఎం సీహెచ్‌ఆర్ పద్మావతి అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులు రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్యసుబ్రహ్మణ్యం తదితరులు రాజేశ్వరి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రాజేశ్వరి తన తల్లిదండ్రులు వెంకట్రావు, పాపాయమ్మల పేరున రూ.లక్ష, తన సోదరి గుణ్ణం కల్యాణి ఆదిలక్ష్మి పేరున రూ.లక్ష పాఠశాలకు విరాళంగా అందజేశారు. జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ నల్లా అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండా

- మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి
- రూ.3.20 కోట్ల మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం


మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం, జనాభాను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధే అజెండాగా నిధులు కేటాయిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదానికి ప్రత్యేక సమావేశం చైర్‌పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. తొలుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీ బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం ముందుంచారు. ప్రారంభ నిల్వగా రూ.2,17,94,140గా, రాబడిగా రూ.11,04,00,699 కాగా, ఖర్చుగా రూ.7,83,09,000గా, మిగులుగా రూ.3,20,91,699గా చూపించారు. మూల ధన ఖర్చుల కోసం రూ.22,31,50,000లు కాగా, ముగింపు నిల్వ రూ.95,35,839గా, అందులో స్కీమ్స్, గ్రాంట్లు రూ.6,29,783 మినహాయించగా, సొంత వనరుల ముగింపు నిల్వ రూ.89,06,056గా బడ్జెట్‌లో చూపించారు.

రాబడులు..

ప్రధాన వనరులైన ఆస్తి పన్ను కరెంటు డిమాండ్‌పై 90 శాతం, ఎరియర్స్‌పై 50 శాతం వసూళ్లు రాగలవని, అసైన్డ్ రెవెన్యూ రూ.కోటి వసూలు కాగలదని అంచనా వేశారు. రెమ్యూనరేటివ్ విభాగానికి సంబంధించి షాపు అద్దెలు, చెట్ల ఫలసాయం, చేపల చెరువులు వంటివి 95 శాతం, వసూలు కాగలవని, మార్కెట్ కిస్తు, జంతు వధశాల రుసుములు వంద శాతం ఉంటాయని అంచనాలను బడ్జెట్‌లో చూపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం, గడప గడపకూ మన ప్రభుత్వం, ప్రత్యేక అభివృద్ధి నిధులు, ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్లు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, రుడా, అమృత్ గ్రాంట్లు, ముఖ్యమంత్రి అభివృద్ధి నిధి వంటి వివిధ ప్రభుత్వ గ్రాంట్లు రాగలవని అంచనా.

ఖర్చులివే..

రాబడి ఆదాయంపై 14.66 శాతం అంటే.. రూ.1,61,80,000లు స్థాపన ఖర్చులు, రాబడి ఆదాయంపై 29.30 శాతం రూ.3,23,50,000లు ప్రజారోగ్య కార్యకలాపాల, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సాధారణ పరిపాలన రోజువారీ ఖర్చుల కోసం బడ్జెట్‌లో అంచనాలను కేటాయించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, శ్మశాన వాటికల అభివృద్ధి, పైపులైన్ల ఏర్పాటు, రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి, వాణిజ్య సముదాయాల నిర్మాణాలను 2024-25 బడ్జెట్‌లో కేటాయించారు. దీనికి సంబంధించి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపగా, చైర్‌పర్సన్ అంగీకార ముద్ర వేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరంలో మురికివాడల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనర్ బి.శ్రీనివాసులు, డీఈ డి.దుర్గాప్రసాద్, కౌన్సిలర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ క్రికెట్ టోర్నీ విజేత కాకినాడ


విజేత కాకినాడ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అంబాజీపేట: సమాజ హితం కోరుకుంటూ మంచి గుర్తింపుతో నిత్యం వేదపఠనం, పూజలతో తలమునకలై ఉండే పురోహితుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జెడ్పీ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి పురోహితుల క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ టోర్నీలో కొవ్వూరు, కాకినాడ మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో 8 పరుగుల తేడాతో కాకినాడ జట్టు విజయం సాధించి విజేతగా నిలవగా, కొవ్వూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. ఉపద్రష్ట విజయ్ అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి విశ్వరూప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణులు పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో కూడా పురోహితుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించే విధంగా సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. అనంతరం జరిగిన సభలో కాకినాడ జట్టును విన్నర్‌గా ప్రకటించి రూ.50 వేల చెక్కు, ట్రోఫీని అందించగా, కొవ్వూరు జట్టుకు రన్నర్స్ కప్, రూ.30 వేలు అందజేశారు. అలాగే సెమీ ఫైనల్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు రూ.పది వేల నగదును, ట్రోఫీని అందజేశారు. పోటీల్లో ఉభయ రాష్ట్రాల నుంచి 300 మంది పురోహిత క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.